
# గ్రీటింగ్ కార్డ్స్



— పొనుగోటి కృష్ణారెడ్డి

అప్పుడే కొత్త సంవత్సరంవచ్చేస్తోందంటే ఆశ్చర్యంగా వుంది వినయ్‌కుమార్‌కు. తొంభైయవ సంవత్సరం నిన్నగాక మొన్న వచ్చినట్టుందతనికి. ఇంతలోనే సంవత్సరం గడిచిపోయిందా?

ఆలోచిస్తూ ఆఫీసు నుంచి ఇంటికి నడిచి వెడుతున్నాడు కుమార్. రోడ్డుకు ఇరువైపులా కొత్తగా వెలిసిన గ్రీటింగ్ కార్డ్స్ షాపులనూ, వాటి చుట్టూ మూగిన జనాన్నీ చూస్తుంటే కొత్త సంవత్సరం గుర్తుకొచ్చింది కుమార్‌కి.

ఇంతలోనే సంవత్సరం అయిపోయిందా! ఈ సంవత్సరం ఏమేమి చేయాలనుకున్నాడో, ఏమి సాధించాలనుకున్నాడో, ఏ ఏ దురలవాట్లు వదిలివేయాలనుకున్నాడో, ఎలాంటి మంచి అలవాట్లు అలవరచుకోవాలనుకున్నాడో అన్నిటి గురించీ తెగ ఆలోచించిన గత డిసెంబర్ చివరి రోజులు గుర్తుకు వచ్చాయతనికి.

నిర్ణయాలు అయితే బోలెడు తీసుకున్నాడుగానీ, ఒక్కటీ అమలు పరచలేదనీ గుర్తొచ్చేసరికి, అతని మీద అతనికే కొద్దిగా కోపం వచ్చింది.

ఆలోచిస్తూ నడుస్తున్న కుమార్, యధాలాపంగా రోడ్డుకు అవతలి వైపున వున్న గ్రీటింగ్ కార్డ్స్ షాపును చూసి ఆగిపోయాడు.

షాపులో గ్రీటింగ్ కార్డ్స్ కొంటోంది దీపశిఖ యూనివర్సిటీలో కుమార్ క్లాస్‌మేట్ ఆమె. బాగా సంపన్నురాలు, ఎవరో ఐ.ఎ.ఎస్. ఆఫీసర్‌ను పెళ్ళి చేసుకుందని విన్నాడు. అతనిప్పుడు సెక్రటేరియేట్‌లో పని చేస్తున్నాడని తెలిసింది.

వెళ్ళి ఆమెను పలకరించాలనుకున్నాడు. అవును, పరిచయం దెబ్బతినకుండా వుంటే మంచిది. ఎప్పుడైనా వాళ్ళతో అవసరం రావచ్చు.

షాపు వైపు నడిచాడు. రోడ్డు దాటడానికి సాధ్యం కాలేదు. ఒకదాని వెనుక మరొక వాహనం దూసుకు వెడుతున్నది. జాగ్రత్తగా, త్వరగానే రోడ్ క్రాస్ చేశాడు. షాప్ వైపు చూస్తే ఆమె కనిపించలేదు. జాగ్రత్తగా చూశాడు జనాన్నంతా. ఆమె లేదు. ఎప్పుడూ ఇంతే ఏమి చేద్దామనుకున్నా ఇంతే! ఏదీ కలిసిరాదు అనుకున్నాడు. కోపంగా వెనక్కు తిరిగాడు.

అతని ముందే దీపశిఖ ఆటో ఎక్కి వెళ్ళిపోతోంది అంటే; ఇప్పటిదాకా తన వెనకే ఆటో కోసం వెయిట్ చేసిందన్నమాట. కుమార్‌ని నిరాశ ఆవహించింది. 'ఎప్పుడూ ఇంతే! తన దురదృష్టం' అనుకున్నాడు.

రెండు నిమిషాలు అక్కడే నిలబడ్డాడు.

కొద్దిసేపు ఆలోచిస్తే? ఎలాగూ రేపో, ఎల్లుండో గ్రీటింగ్ కార్డ్స్ కొనాలి. షాపు దాకా వచ్చాను కాబట్టి ఈ రోజే కొంటే పోతుంది అనిపించింది కుమార్‌కు.

జేబులో డబ్బులు చూసుకున్నాడు రెండు వందలు వుంది. తనకో ఇరవై, ముప్పై గ్రీటింగ్ కార్డ్స్ సరిపోతాయి. తనకి వచ్చే గ్రీటింగ్ కార్డ్స్ కూడా అంతకన్నా ఎక్కువ వుండవు. యాభై, అరవై రూపాయిలయితే సరిపోతుంది. పర్సు జేబులో పెట్టుకుని షాపులోకి వెళ్ళాడు.

ఆ బొమ్మల్ని చూస్తుంటే, ఈ ప్రకృతిని చూడడానికి ప్రతి మనిషికీ మూడవ నేత్రాన్ని ప్రసాదిస్తుందేమో ఫోటోగ్రఫీ అనిపించింది కుమార్‌కి.

ముఖ్యంగా ఎంతో అందంగా, మనోహరంగా అమాయకంగా నవ్వుతున్న ఆ పాప ఫోటో వున్న గ్రీటింగ్ కార్డ్స్ చూస్తుంటే అలాగే నిలబడి చూడాలనిపించింది కుమార్‌కి.

'ఇదిగో అంజలి' ప్రక్కనెవరో అన్నారు.

'అంజలి కాదు షామిలి' సవరించారు.

ఆ పాప ఫోటోను చూస్తుంటే కూతురు, భార్య గుర్తుకొచ్చారు కుమార్‌కు.

షామిలి ఏ సినిమాలో వుంటే ఆ సినిమా రెండు సార్లయినా చూపించందే వూరుకోరు అతని భార్య, కూతరూ.

సినిమా చూసినప్పుడల్లా కుమార్‌తో అతని భార్య అనేది ''ఇలాంటి పాప ఒక్కతుంటే చాలండీ జీవితంలో ఇంకేం అక్కరలేదు.

ఈ పాప ఇప్పుడే ఇన్‌కంటాక్స్ కడుతుందటండి ఆశ్చర్యంగా చెప్పేది.

ఈ విషయం గుర్తొచ్చేసరికి పాప రికరింగ్ డిపాజిట్ విషయం గుర్తుకు వచ్చింది.

నెలకు వంద రూపాయిలైనా పాప పేరుతో రికరింగ్ డిపాజిట్ చేద్దామనుకున్నాడు కుమార్. గత నూతన సంవత్సరం సందర్భంగా తీసుకున్న నిర్ణయాలలో అదీ ఒకటి.

ఇంతవరకు పైసా కూడా ఆ పాప పేరుతో జమ చేయలేకపోయాడు. తన నిర్లిప్తత, అలసత్వం చాలా చికాకనిపించిందతనికి.

ఈ సంవత్సరం నుంచైనా జాగ్రత్తగా వుండాలనుకున్నాడు పొదుపు పాటించాలనుకున్నాడు. అలా ఆలోచిస్తూ అప్పటివరకు చేతికి తీసుకున్న గ్రీటింగ్ కార్డ్స్ ఎన్నో చూశాడు. ఇరవై రెండు వున్నాయి.

ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా పది తీసుకుని, మిగతావి అక్కడ పడేసి డబ్బు చెల్లించి ఇంటికి బయలుదేరాడు. ఇంటికొచ్చాక భోంచేసి పడుకున్నాడే గాని ఎంతకూ నిద్ర పట్టలేదు భార్య పుట్టింటికి వెళ్ళి వుండడం. గతం, భవిష్యత్ కలగా పులగంగా గుర్తుకు వస్తుండడంతో కుమార్‌కు నిద్ర దూరమైంది.

ఎలాగూ నిద్ర రావడం లేదు. కాబట్టి, లేచి గ్రీటింగ్ కార్డ్స్‌పై అడ్రస్‌లు వ్రాద్దామనుకున్నాడు. మంచం దిగి, లైటు వేసి గ్రీటింగ్ కార్డ్స్ ముందేసుకు కూర్చున్నాడు.

ఎవరెవరికి పంపాలో అర్థం కాలేదు. వుండే కార్డ్స్ పది!

''కట్నం గుంజుకుని ఎగిరి గంతులేస్తూ మీరు పెళ్ళి చేసుకున్నట్టు, దీని పెళ్ళి జరిగిపోద్దనుకుంటున్నారేమో...''

శ్రీమతి ఎప్పుడూ వేసే గొణుగుడు రికార్డు మళ్ళీ వినిపించింది కుమార్‌కి. ఓ పేపర్ తీసుకుని 'ఆర్డర్ ఆఫ్ ప్రయారిటీ' ప్రకారం లిస్టు వ్రాయడం ప్రారంభించాడు కుమార్.

శ్రీమతి, నాన్న, తమ్ముడు, శేషయ్య, వెంకట్రావు, మాష్టారు... ఇలా ముఖ్యమైన పేర్లు వ్రాసేసరికి పదిహేను పేర్లు అయ్యాయి.

ఉన్న గ్రీటింగ్ కార్డ్స్ పది.

మళ్ళీ వీటిలోంచి ఐదు పేర్లు తీసెయ్యాలనుకుని ఒక్కసారి మళ్ళీ లిస్టు చూశాడు.

శ్రీమతి- తప్పకుండా పంపాలి. లేకపోతే తనమీద ప్రేమ తగ్గిపోయింది అనుకుంటుంది. దిగులుపడుతుంది. తనమీద అనుమానపడుతుంది.

రెండవ పేరు దగ్గరకు వచ్చాడు-నాన్న. తనకు వూహ తెలిసినప్పటి నుంచి, ఇంతవరకు పంపకుండా వుండలేదు. ఇప్పుడు పంపకపోతే బావుండదు.

మూడు-తమ్ముడు. పేరు తమ్ముడేగానీ వాడు తనకి బెస్ట్ ఫ్రెండ్. వాడు బి.యస్సీ. పాసై నిరుద్యోగిగా వున్నాడు.

తమ్ముడు గుర్తొచ్చేసరికి బావమరిది గోపాల్ గుర్తొచ్చాడు. గోపాల్‌కింకా పెళ్ళి కాలేదు. ఈమధ్యే బ్యాంక్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరాడు. మొదటి జీతంతో తనకు, శ్రీమతికి ఖరీదైన బట్టలు తెచ్చాడు. అతనికి తను ఇంతవరకూ ఏమీ ఇవ్వలేదు. కనీసం గ్రీటింగ్ కార్డు అయినా పంపాలి.

పైగా ఈసారి అతను కాన్పూర్ నుంచి వచ్చేటప్పుడు ఖరీదైన ఎంబాసిడర్ బూట్లు తెమ్మని చెప్పాడు. ఇప్పుడు గనుక గ్రీటింగ్ కార్డ్ పంపితే, రెండు రూపాయిలకు నాలుగు, ఐదు వందల రూపాయిల బూట్లు తప్పకుండా గుర్తుంచుకుని తెస్తాడు. మూడవ నెంబర్ దగ్గర గోపాల్ పేరు ఇరికించాడు.

తమ్ముడి పేరు తీసేస్తే ఎలా అనిపించింది కుమార్‌కు.

తమ్ముడికి పంపకపోతే బాధపడతాడు. నిరుద్యోగి అయిన తనను అన్న నిర్లక్ష్యం చేశాడు అనుకుంటాడు.

మరి ఎలా? ఫ్లాష్ వెలిగిందతనికి.

ఒకే గ్రీటింగ్ కార్డ్‌లో నాన్నకు, తమ్ముడికి అని వ్రాస్తే!

బావుండదేమో! అనుకున్నాడు.

నాన్నకు చేరి తమ్ముడికి చేరకపోతే పోస్ట్‌లో పోయిందనుకుంటాడు తప్ప, పంపలేదు అనుకోడు.

నిరుద్యోగి అయిన వాడికి ఉద్యోగం సంపాదించే విషయంలో ఏదైనా సహాయం చేయగలగాలిగానీ, గ్రీటింగ్ కార్డ్ పంపితేనేమి? పంపకపోతేనేమి?

తమ్ముడి పేరు కొట్టేశాడు లిస్ట్‌లోంచి. శేషయ్య, కుమార్, శ్రీధర్ బెంచిమేట్స్. వాడు గుర్తుకొచ్చేసరికి బాల్యం అంతా ఒక్కసారి కళ్ళముందు మెదిలింది కుమార్‌కి. స్కూలు ఎగ్గొట్టి చెరువులో ఈతకు, నేరేడు పళ్ళకు, తాటి ముంజలకు పోవడం, వెన్నెల రోజుల్లో అర్ధరాత్రిదాకా 'ఆకాట' ఆడటం అన్నీ గుర్తొచ్చాయి. ఇంకా ఎంతోమంది బాల్య స్నేహితులు వున్నా శేషయ్యను మర్చిపోలేదు కుమార్.

రాత్రులు మామిడి కాయల దొంగతనానికి వెళ్ళినప్పుడు, ఇంటి వాళ్ళు మేలుకుంటే కుమార్‌ని తప్పించడం కోసం శేషయ్య దొరికిపోయి దెబ్బలు తిన్న సందర్భాలెన్నో వున్నాయి.

ఎందుకు అలా చేశావురా అంటే 'ఇవన్నీ నీవల్లకాని పనుల్లే. నేనంటే మొద్దోణ్ణి. వాళ్ళు నన్ను పట్టుకు రెండు తన్ని వదిలేస్తే సరి. లేకపోతే వాళ్ళని రెండు తన్ని అయినా నేను తప్పించుకుని బయట పడతాను. అది నీవల్ల కాదు' అనేవాడు శేషయ్య.

ఏడవ తరగతి కామన్ పరీక్షల్లో ఫెయిల్ అయి, అతనిప్పుడు పల్లెలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ప్రతి సంవత్సరం కుమార్ పంపే గ్రీటింగ్ కార్డ్ పెద్ద సంబరం అతనికి.

అది చంకలో పెట్టుకుని 'నా సావాసగాడు పంపించేడు' అని వూరంతా తిరిగి అడిగినోళ్ళకంతా కుమార్ గురించి గొప్పలు చెబుతాడు. అదే తమ బెంచ్‌మేట్ శ్రీధర్ గురించి పట్టించుకోడు. అందుకే శ్రీధర్‌కి శేషయ్యంటే చాలా కోపం.

శ్రీధర్, కుమార్, శేషయ్య ఏడో తరగతి దాకా కలిసి చదివారు. కలిసి తిరిగారు. అయినా శేషయ్య కుమార్‌తో ఉన్నంత ఆత్మీయంగా శ్రీధర్‌తో వుండడు. శ్రీధర్ ఇప్పుడు హైదరాబాద్‌లో ఏదో పత్రికలో ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్ కూడా అప్పుడప్పుడు ఏదో వ్రాస్తుంటాడు. ఆ రచనలు శ్రీధర్‌కు పంపుదామనుకుంటాడుగానీ మొహమాటం అడ్డువస్తుంది. వాళ్ళ మధ్య విరోధం లేదుగానీ పాత స్నేహ సంబంధాలూ లేవు.

రెండు నెలల క్రితం హైదరాబాద్ వెళ్ళాడు కుమార్. శ్రీధర్ తప్ప అక్కడ కుమార్‌కు తెలిసిన వాళ్ళెవరూ లేరు. కాబట్టి నేరుగా శ్రీధర్ ఇంటికి వెళదామనుకున్నాడు. కానీ ఏదో తెలియని మొహమాటం అడ్డొచ్చి లాడ్జిలో దిగాడు.

రోజుకు ఏభై రూపాయిల చొప్పున రెండు వందల నలభై రూపాయిలు అద్దె కట్టాడు.

'శ్రీధర్‌తో పరిచయం బ్రేక్ కాకుండా వుంటే ఈ ఖర్చు తప్పివుండేది. ముందు ముందు ఈ ఖర్చు తప్పాలన్నా, ఒకటి అరా రచనలు అచ్చుకావాలన్నా వాడితో సంబంధం కొనసాగడం మంచిది' అనుకున్నాడు కుమార్.

మామూలుగా ఉత్తరం వ్రాస్తే వాడు వేరే విధంగా భావించవచ్చుగానీ, గ్రీటింగ్ కార్డ్ పంపితే అలా అనుకోడు. ఇదే మంచి అవకాశం అన్న నిశ్చయానికొచ్చాడు కుమార్.

వెంటనే శేషయ్య పేరు కొట్టేసి, శ్రీధర్ పేరు రాశాడు.

తరువాత పేరు, కుమార్ ఎలిమెంటరీ స్కూల్ మాష్టారు వెంకట్రావు గారిది.

ఈ రోజు కుమార్ ఈ స్థానంలో వున్నాడంటే దానికి కారణం ఆయనే. చిన్నప్పుడు కుమార్ వాళ్ళ నాన్న అతన్ని స్కూలు మాన్పించి పశువుల దగ్గరకు పంపిస్తానంటే మాష్టారే పట్టుబట్టి మంచి తెలివిగలవాడు. చదువులో బాగా పైకి వస్తాడు' అని వాళ్ళ నాన్నకు నచ్చచెప్పి, పట్టుదలగా కుమార్‌ను బాగా చదివించి, రాత్రులు కూడా వాళ్ళ ఇంటిలోనే పడుకోబెట్టుకుని తెల్లవారు ఝామునే లేపి, పాఠాలు చెప్పి-ఇంతవాణ్ణి చేశాడు. అందుకే ఆయనకు కుమార్ తన మొదట జీతంతో బట్టలు పెట్టాడు. కృతజ్ఞతతో 'ఇప్పటికీ ఆయన 'వాడు నా శిష్యుడు' అని చెప్పి గర్విస్తుంటాడు.

ఇప్పుడు ఆయనకు వినపడదు. కనపడదు. వయసు మీదపడింది. ఏదో తన తృప్తి కోసం గ్రీటింగ్ కార్డ్ పంపడం తప్ప ప్రయోజనం లేదు. అనుకున్నాడు కుమార్.

ఎవరి ఆనందంకోసం పంపుతున్నామో వారికి తెలియనప్పుడు పంపి మాత్రం ప్రయోజనం ఏముంది? అనిపించిందతనికి.

వెంకట్రావు మాష్టారిగారి పేరు కొట్టేశాడు. ఆఫీసులో ఆత్మీయత కనబరచే మోహన్రావు, ఇంకా ఇతర మిత్రుల పేర్లు చెరిగిపోయి, కొత్త పేర్లు చేరాయి.

అడ్రసు వ్రాయడం అయిపోయింది.

అప్పుడు కొంచెం తృప్తిగా పక్కమీద వాలాడు కుమార్. తను చేసిన పనిని గురించి ఆలోచనొచ్చిందో నిమిషం. వాస్తవంగా ఎవరైతే తనకు శుభాలను కాంక్షించారో వాళ్ళు ఈ గ్రీటింగ్ కార్డుల లిస్టులో నుంచి జారిపోయినట్టు గ్రహించాడు. ''అదేం లేదు, ఆత్మీయులకు 'గ్రీటింగ్స్' పంపకపోయినా ఫర్వాలేదు. అని సరిపెట్టుకున్నాడు. ఆ తర్వాత కొత్త సంవత్సరం [illegible]జనకంగా కళ్ళముందు కనిపిస్తోంది కుమార్‌కు. ◆

త్వరలో
యర్రంశెట్టి శాయి
సీరియల్